మధుకు తన గదిలో టేబుల్ మీద ఉన్న వదిన ఫొటో క్రింద ఉన్న చీటీ కనిపించింది.

స్వయంగా చెప్పలేక కాగితం మీద రాసిన భావాలూ, ఇన్నాళ్ళూ ఆమెపడ్డ మానసిక వ్యధ చదివి ఘోరునఏడ్చాడు మధు. తన తల్లిని తన నుంచి వేరుచేసిన తన ఆకారాన్ని అసహ్యించుకుంటూ.

*

—ఇల్ల మురళీధర్

# 'అమృత హస్తం'

అది రాయలసీమలోని ఓ కుగ్రామం.

ఆ వూరి పొలిమేరల్లో 'జాతర' జరుగుతోంది మూడేళ్ళకోసారి జరిగే ఆ జాతరలో, చుట్టుపక్కలున్న దాదాపు యాభై గ్రామాలు పాల్గొంటున్నాయి. అలంకరించిన 'ఎడ్లబండ్లు', 'తప్పెట గూళ్ళు, కోలాటాలు, చెక్కభజనలు' వగైరాలతో ఎంతో అట్టహాసంగా వుంది.

ఆ జాతరకో ప్రత్యేకత వుంది. గుప్పిట నిండుగా కర్పూరం పట్టుకొని జాతర సందర్భంగా రగిలించిన అగ్నిగుండం దగ్గరకు వెళతారు భక్తులు. అక్కడున్న 'పోలేరమ్మ పూజారి' గుండంలోని నిప్పుతో వారి చేతిలోని కర్పూరాన్ని వెలిగిస్తాడు. పూనక మొచ్చినట్లు ఊగిపోతూ, పొలికేకలు పెడుతూ ఇతర భక్తులు చుట్టుముట్టగా, చేతిలోని కర్పూరం పూర్తిగా కాలిపోయినంతవరకూ కదలకుండా నిలుచుంటారు. కాలిన గాయానికి పసుపు కుంకుమలు వేసి కట్టుకడతాడు పూజారి, ఆ గాయం నయమయ్యేలోగా కోరుకున్న కోరికలు తప్పక తీరతాయని ప్రజల నమ్మకం.

ఈ దురాచారాన్ని రూపుమాపాలని నిశ్చయించుకున్నాడు మధు. 'ముందు జాగ్రత్తగా టౌన్‌నుండి 'యస్సయ్'గారికి ఈ విషయం తెలియజేసి రహస్యంగా 'మఫ్టీ' బందోబస్తు ఏర్పాటు చేయించాడు. యస్సయ్‌గారు తన సిబ్బందితోసహా ఆ గుడిసెలో, యువజనసంఘ సభ్యులతోసహా 'రెడీ'గా వున్నారు.

అగ్నిగుండం చుట్టూ జనం గుమికూడి ఉన్నారు. ఎర్రటి ముసుగు కప్పుకొని, అరచేతి నిండుగా కర్పూరం పట్టుకొని వరసగా గుండం వద్దకెళ్తున్నారు భక్తులు. పూజారి కర్పూరానికి నిప్పు పెట్టగానే ఓ పక్కగా నిలబడుతున్నారు. ఇతర భక్తులు వారిచుట్టూ మూగి పూనకం వచ్చిన వాళ్ళలా చిందులు తొక్కుతూ 'పొలో.... పొలి!' అంటూ కేకలు పెడుతున్నారు. భీకరంగా వుందా వాతావరణం.

'ఆగండి!' గర్జించాడు యస్సయ్. అలా కర్పూరాన్ని చేతుల్లో కాల్చటం చట్టరీత్యా నేరం. కాదని ఎవరైనా అలాచేస్తే అరెస్టు చేస్తాను' బెదిరించాడు.

'ఇది మా ఆచారం! ఇలా చెయ్యకుంటే ఆమ్మోరికి కోపమొచ్చి అన్ని వూళ్ళనీ స్మశానం చేస్తుంది'.... అంటూ జాతర పెద్దల్ని వుసిగొలిపాడు పూజారి.

'యస్సయ్‌గారూ! దయచేసి మా ఆచారాలకి అడ్డురాకండి. మిమ్మల్నిక్కడికి తీసుకొచ్చిందెవరో మాకు తెలుసు. ఆ కుర్రకుంకల సంగతి తర్వాత చూస్తాం! ఊఁ! కానీవయ్యా పూజారీ' ఊగిపోయారు జాతర పెద్దలు.

'మీరు మమ్మల్ని ఏం చేసినా సరే! ఈ దారుణాన్ని ఆపి తీరుతాం!' రొమ్ము విరిచి ముందుకొచ్చాడు మధు. ఫలితం కనిపించక పోయేసరికి యస్సయ్ విజిల్ వూదాడు. 'యూనిఫాం'లో వున్న పోలీసులు సడన్‌గా ముందుకొచ్చారు. పూజారి కార్యక్రమాన్ని తిరిగి మొదలెట్టాడు. ఓ భక్తురాలి చేతిలోని కర్పూరాన్ని వెలిగించబోతుండగా మధు ముందుకు వురికి పూజారిని పక్కకులాగాడు. ఇంతలో ఆమె తన చేతిలోని కర్పూరాన్ని తానే వెలిగించుకోబోయింది.

'ఆగమ్మా.... అంటించుకోకు.... దయచేసి కిందపడెయ్!' కంగారుగా అరిచాడు. అయినా ఆమె వినిపించుకోలేదు. ఇహ ఆలోచించలేదు మధు. ఆమె చెంప 'ఛెళ్' మనిపించాడు. విసురుగా కింద పడిందామె. చేతిలోని కర్పూరం ఎగిరి దూరంగా పడింది. ఆమె కప్పుకున్న 'ఎర్రటి' ముసుగు తొలగిపోయింది. లేవదీయడానికి వెళ్ళిన మధు ఆమెని దగ్గరగా చూసి అదిరిపడ్డాడు.

ఆమె.... ఎవరోకాదు.... మధు వదినగారు.

ఆమె లేచి నిలబడింది తలొంచుకొని. 'మధు వాళ్ళ వదిన' అంటూ చుట్టూవున్న జనంలో నుండి గుసగుసలు మొదలయ్యాయి. మధుకు తల కొట్టేసినంత అవమానంగా వుంది.

'బిస్నీ' అని ఒకతన్ని పిలిచి వదిన్ని ఇంట్లో దింపిరా! అంటూ ఇద్దరు యువకుల్ని తోడుగావుంచి బండిలో ఎక్కించాడు. ఇద్దరు గ్రామపెద్దల్ని అరెస్టుచేసి, అక్కడి పరిస్థితినంతా చక్కదిద్దారు యస్సయ్‌గారు. తర్వాత ఇంటికెళ్ళాడు మూర్తి.

ఇల్లంతా బారాసిగా ఉంది. ఓ గదిలో.... పిల్లల్ని సందిట్లోకితీసుకొని మౌనంగా రోదిస్తోంది వదిన. ఆమె ఎదుటికిరావటానికి ముఖం చెల్లలేదు మధుకి. తన గదిలో ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

"తల్లిలాంటి వదినపై చేయిచేసుకోవడానికి నీకు మనసెలా ఒప్పిందిరా మూర్ఖుడా!" అన్న అక్కమాటల్లో ఆలోచిస్తున్న మధు ఈ లోకం లోకి వచ్చాడు. ఎదురుగా అక్కయ్య రౌద్రమూర్తిలా నిలబడి వుంది.

వదిన అలా మూర్ఖంగా చేతులు కాల్చుకుంటూంటే ఆపటం తప్పా?" అడిగాడు. 'అంతేరా నువ్వు ఆలోచించగలిగేది. ఆమె ఎవరికోసం అలా చేసిందో తెలుసా?....మనకోసం....! మనిద్దరికోసంరా'

స్రవంతి నెం: 14లో ఇచ్చిన

"తల్లిలాంటి వదినపై చేయిచేసుకోవడానికి నీకు మనసెలా ఒప్పిందిరా మూర్ఖుడా!" అన్న అక్క మాటలతో. ఆలోచిస్తూన్న మధు ఈ లోకంలోకి వచ్చాడు.

వాక్యం ఆధారంగా రాసిన కథలు.

'మనకోసమా?' ఆశ్చర్యపోయాడు మధు.

'అవును. అమ్మా నాన్నల ప్రేమ తెలియని మనకు అన్నీ తానే అయి పెంచింది మనిద్దర్నీ. తన భర్తపోయినా అధైర్యపడకుండా నిన్ను చదివించింది. నాకు త్వరగా పెళ్ళికావాలని, నీకు మంచి ఉద్యోగం రావాలనీ మొక్కుకుని అలా చేసిందామె. ఆమెకి చదువులేకపోవచ్చు.... మన పట్ల మమకారం వుందిరా' ఏడుస్తోంది మధు అక్కయ్య.

నిశ్చేష్టుడయ్యాడు మధు.

తన కోసమేనా వదిన అంతటి పనికి సిద్ధపడింది? అలాంటి దేవతపైనా తానుచేయి చేసుకున్నది కానీ....ఆ సమయంలో తాను అడ్డుపడకుంటే?.... వదిన చేతులు కాల్చుకునివుంటే? తాను భరించగలడా? నో. కానీ...., ఏమైనా. తల్లికంటే ఎక్కువైన వదినపై చేయిచేసుకోవటం...." ఆలోచిస్తున్నకొద్దీ మధుకు దుఃఖం పెల్లుబుకుతోంది. ఒక్క ఉదుటునలేచి వదిన వున్న గదిలోకెళ్ళి ఆమె పాదాలపై వాలిపోయాడు.

"అమ్మా....నన్ను క్షమించమ్మా! మీకు ఏ చిన్న బాధకలిగినా, నా మనసు తల్లడిల్లిపోతుందమ్మా. అందుకే....స్పర్శలో చల్లదనాన్ని కురిపించే మీ చేతిని కాలిన గాయాలతో చూడలేక....అలా చేశానమ్మా" వదిన కాళ్ళపై తల వాల్చి పసిపిల్లవాడిలా ఏడుస్తున్న మధు తలని ప్రేమగా, ఆప్యాయంగా నిమిరిందా అమృతమూర్తి.

*

— పవన్-కార్టూనిస్ట్
(కడప)

## ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"అచ్చం నాలాగే ఉన్నాడా? నో! ఇది అసంభవం." ఆ హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.